క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార: ఏపీఈపీడీసీఎల్ జోన్–1 పరిధి డాక్టర్స్ కాలనీ, 33/11 కేవీ ఎంఎంటీసీ సెక్షన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డాక్టర్స్ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, అంబేడ్కర్ నగర్, ఏఎస్ ఎన్‌క్లేవ్, వైజాగ్ హట్స్, సీతమ్మధార, అల్లూరి సీతారామరాజు జంక్షన్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

అక్కయ్యపాలెం సెక్షన్‌లో..

సీతంపేట: అక్కయ్యపాలెం సెక్షన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు స్టీల్ సిటీ ఆఫీస్, ఎన్జీజీవోస్ కాలనీ, ఐసీడబ్ల్యూ భవన్, జీవీఎంసీ పంప్ హౌస్, జీవీఎంసీ స్కూల్స్, ఆరోగ్య కేంద్రం, కిన్నెల మెస్, పద్మశ్రీ ఆస్పత్రి, నరసింహనగర్ రైతుబజార్, బిజినెస్ సెంటర్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, సింధూర గెస్ట్‌హౌస్, ఈటర్స్ స్టాప్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

జీవీఎంసీ కమిషనర్ దృష్టికి వార్డు సమస్యలు



కమిషనర్ రాజాబాబుకు వినతిపత్రం ఇస్తున్న 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ కమిషనర్ రాజాబాబును గురువారం 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి కలిసి, తమ వార్డు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో జాప్యం, స్థానికులకు కలుగుతున్న అసౌకర్యాలు, అసంపూర్తిగా వదిలేసిన పలు పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆయనను కోరారు. 24/7 తాగునీటి సరఫరా కోసం తవ్విన రహదారులను వెంటనే బాగుచేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

రూరల్ తహసీల్దార్ కిరణ్ బదిలీ

ఆరిలోవ: రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్ గురువారం బదిలీ అయ్యారు. ఆయనను రూరల్ మండలం నుంచి కలెక్టరేట్‌కు బదిలీ చేసినట్లు కలెక్టర్ మల్లికార్జున మధ్యాహ్నం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో పాడేరు మండలం తహసీల్దారు రమణయ్యను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు రమణయ్య గురువారం సాయంత్రం ఇక్కడ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. కిరణ్ కూడా కలెక్టర్‌కు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. పాల్ కిరణ్ రూరల్ తహసీల్దారుగా ఆరు నెలల క్రితం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి నుంచి తనను రిలీవ్ చేయాలని ఇటీవల కలెక్టర్‌కు విన్నవించుకోవడంతో బదిలీ చేసినట్లు తెలిసింది.

డంపర్ బిన్లు శిథిలం



మధురానగర్ రోడ్‌లో శిథిలమైన డంపర్ బిన్

సీతంపేట: జీవీఎంసీ 25, 26 వార్డుల్లో చెత్త కోసం ఏర్పాటు చేసిన డంపర్ బిన్లు అధ్వానంగా ఉన్నాయి. పెద్ద పెద్ద రంధ్రాలతో పూర్తిగా శిథిలమై రోత పుట్టిస్తున్నాయి. రంధ్రాలకు అడ్డంగా చెక్కబల్లలు అడ్డుపెట్టి వాడుతున్నారు. డంపర్ బిన్లు దారుణంగా మారాయని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెల నగరంలో జీ–20 సదస్సు జరగనున్న నేపథ్యంలో సుందరీకరణకు ప్రాధాన్యమిస్తున్న తరుణంలో ఇటువంటి డంపర్ బిన్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

పార్టీకి మీరే రథసారథులు



కిట్లు అందజేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, సమన్వయకర్త కె.కె.రాజు



గృహసారథులు, కన్వీనర్లకు అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో మేయర్ హరివెంకటకుమారి
- కె.కె.రాజు ఆధ్వర్యంలో శిక్షణ

సీతంపేట: వైఎస్సార్‌సీపీ విజయానికి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులే రథసారథులని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గురువారం ఉదయం 26, 42, 43, 44 వార్డులకు సంబంధించి జేసీఎస్ గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమం అక్కయ్యపాలెం అబిద్‌నగర్ షాదీఖానాలో జరిగింది. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, ప్రతి క్లస్టర్‌కు ఇద్దరు గృహసారథులను నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసి పార్టీకి మద్దతు తెలిపేలా కృషి చేయాలని కోరారు. జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథుల బాధ్యతలు, విధులపై వీడియో ద్వారా అవగాహన కల్పించారు.

జగనన్న ప్రభుత్వానికి మంచిపేరు తెండి..

మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత ఉండి సంక్షేమానికి నోచుకోని వారందరినీ గుర్తించేందుకు వలంటీర్లతోపాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను నియమించారన్నారు. పార్టీకి రథసారథులుగా ఉంటూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి జగనన్న ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం గృహసారథులకు 'మా నమ్మకం నువ్వే జగనన్న' కిట్లను వారు అందజేశారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు చిక్కాల రామారావు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పెద్దిశెట్టి ఉషశ్రీ, పార్టీ వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, మండల కన్వీనర్ బులుసు జగదీష్, సీనియర్ నాయకులు ఐ.హెచ్.ఫారూఖీ, పేడాడ రమణికుమారి, డైరెక్టర్లు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

విధులు, బాధ్యతలపై అవగాహన

వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అబిద్‌నగర్ షాదీఖానాలో 45, 46, 47, 48 వార్డుల జేసీఎస్ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై వారికి ఆయన అవగాహన కల్పించారు. ప్రజల చెంతకు సంక్షేమ పథకాలను తీసుకెళ్లి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు చిక్కాల రామారావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్, కార్పొరేటర్ కె.కామేశ్వరి, కోఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, పార్టీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, మండల కన్వీనర్ కె.వెంగళరావు పాల్గొన్నారు.

లలితా పీఠంలో సంకటహర చతుర్థి



గణపతికి పూజలు చేస్తున్న అర్చకులు



లక్ష్మీగణపతి హోమం చేస్తున్న పండితులు

అక్కయ్యపాలెం: సంకటహర చతుర్థి సందర్భంగా గురువారం సాయంత్రం లలితానగర్ లలితా పీఠంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. గణపతికి ప్రీతిపాత్రమైన తిథుల్లో చతుర్థి ఒకటని, మనుషులను కష్టాల నుంచి గట్టెక్కించేది ఈ వ్రతం ఎంతో విశిష్టమైనదని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పీఠం అర్చకుల మంత్రోచ్చారణల నడుమ దూప దీప నైవేద్యం, గణేశ స్తోత్రం, వ్రత కథ చదివారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తంగా గణపతి హోమం నిర్వహించారు.

ఈ హోమం వల్ల కార్యసిద్ధి, ఆరోగ్యం, విజయం లభిస్తాయని అర్చకులు చెప్పారు. పంచమి సందర్భంగా శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు వారాహి హోమం జరుగుతుందని కృష్ణసేన్ తెలిపారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు



ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఆధ్వర్యంలో దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు

మర్రిపాలెం: బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను గురువారం కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. మర్రిపాలెం రైతుబజార్, మర్రిపాలెం, 104 ఏరియా బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న షాపులు, బడ్డీకొట్లు, తోపుడు బళ్లు, పార్క్‌చేసిన వాహనాలను తొలగించినట్టు సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్టు ఆయన చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చామని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించిన 15 మందిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్ ఎస్ఐ వాసుదేవరావు, ఏఎస్ఐ ఆదినారాయణ, హెచ్‌సీలు జయశీలన్, సురేష్, కానిస్టేబుళ్లు మోహన్, అప్పారావు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థలో ఉచిత వైద్య సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సూర్యతేజ

డాబాగార్డెన్స్: పాతనగంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో గురువారం ఉచితంగా బీపీ, షుగర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా రెండో గురువారం స్నేహ సంధ్యా ఏజీకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యతేజ మాట్లాడుతూ సంస్థలోని వృద్ధులతో పాటు పరిసర ప్రాంతాల్లో గల నిరుపేదలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. క్రమ పద్ధతిలో మందులు వాడాలని, అలాగే శరీరానికి తగిన వ్యాయామం కూడా అవసరం అన్నారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ వైద్య శిబిరానికి వచ్చిన పేషెంట్లకు అల్పాహారం అందించామన్నారు. ఈ ఉచిత వైద్య సేవలు నిరుపేదలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాదు నాయుడు, పుండరీకాక్ష, రమణ, సుమతి, లావణ్య, అనూష, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెనుప్రమాదం

అదుపుతప్పి పండ్ల దుకాణంలోకి దూసుకెళ్లిన కారు



హైవేపై విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి పోర్టు స్టేడియం ఎదురుగా జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి పండ్ల దుకాణంపైకి దూసుకుపోయిన ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. హైవేపై గురుద్వారా జంక్షన్ నుంచి అక్కయ్యపాలెం సిగ్నల్ వైపుగా లారీతోపాటు కారు వెళ్తున్నాయి. పోర్టు స్టేడియం సమీపంలో కారు లారీని దాటుకొని ముందుకెళ్లింది. ఆ సమయంలో లారీ ఫుట్ ట్రస్ట్ కారు వెనుక భాగానికి తగలడంతో ఒక్కసారిగా కారు నడుపుతున్న వ్యక్తి స్టీరింగ్ ఎడమ చేతి వైపు తిప్పడంతో అదుపుతప్పింది. పక్కనే ఉన్న పండ్ల దుకాణంలోకి దూసుకుపోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కారులో ఉన్న ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళారంగ ప్రముఖులు

డాబాగార్డెన్స్: స్వర గీతిక సాంస్కృతిక సంగీత సంస్థ ఆధ్వర్యంలో 'ఒకసారి కలలోకి రావయ్యా' పేరిట 3 గంటల పాటు నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన సంగీత విభావరిని కళారంగ ప్రముఖులు సన్‌మూర్తి, చెన్నా తిరుమలరావు, సంస్థ వ్యవస్థాపకుడు పట్నాల రాజారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నగరానికి చెందిన గాయకులు రాజారావు, పల్లా వెంకటేష్, శ్యాంసుందర్, ఎస్ఎస్ఎన్ రాజు, బొమ్మిడి సత్యనారాయణ, మహ్మద్ ఖాన్, శివకోటి జగదీష్, లోకేష్, దేవదాసు, రాము, వీవీఎస్ మూర్తి, గాయనీమణులు కందర్ప రాధ, గౌరీ, మాధురి, కుమారి, మను, శ్రీదేవి, జాస్మిన్, లయ, ఆదిలక్ష్మి తదితరులు అనేక యుగళగీతాలు ఆలపించారు. సోమేష్ బృందం వాద్య సహకారం అందించింది.

'మానవత–నైతికత'పై రాష్ట్రవ్యాప్త జాగృతి ఉద్యమం

డాబాగార్డెన్స్: జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 20 వరకు 'మానవత–నైతికత'పై రాష్ట్రవ్యాప్తంగా జాగృతి ఉద్యమం చేపట్టనున్నట్టు సంస్థ ప్రతినిధులు షేక్ మక్బూల్, జియా ఆలీఖాన్, మహ్మద్ ఇబ్రహీం తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని మహారాణిపేటలోని ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ కార్యాలయంలో జాగృతి ఉద్యమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు మనిషి వైజ్ఞానిక అభివృద్ధిలో దూసుకుపోతున్నా, మానవతా విలువలు నానాటికీ దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం నిత్యం అశాంతి, అలజడికి గురవుతుందని, అందుకు నిదర్శనం నేడు సమాజంలో పెరిగిపోతున్న నేరాలు, మారణహోమాలేనని పేర్కొన్నారు. దైవభీతి, జవాబుదారీతనం వల్లే మనిషిలో అవసరమైన మానవీయత, నైతికత జనిస్తాయని తెలిపారు. సమాజంలో ఈ భావన పెంపొందించే ఉన్నత లక్ష్యంతోనే ఇస్లామి హింద్ సంస్థ జాగృతి ఉద్యమాన్ని నిర్వహిస్తుందన్నారు. నిర్వాహకులు మహ్మద్ ఇబ్రహీం, షేక్ సిరాజ్, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గాలి

మద్దిలపాలెం: లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు పన్నులు చెల్లిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ విక్రయానికి ఒక ఏజెంట్‌గా బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు వ్యవహరించడాన్ని మానుకోవాలని హితవు పలికారు. ఉత్తరాంధ్రపై అమితమైన ప్రేమ ఉన్నట్టు జీవీఎల్ వ్యవహరించడం అనుమానాస్పదంగా ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయింపుపై ఏనాడు చర్చించలేదన్నారు. కావాలనే స్టీల్‌ప్లాంట్ నష్టాలను చూపిస్తున్నారని ఆరోపించారు. ప్లాంట్ ఏర్పాటు చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి కేవలం రూ.5వేల కోట్లు అని, పన్నుల రూపంలో ఇప్పటి వరకూ రూ.52 వేల కోట్లు అందుకున్న విషయాన్ని దాచిపెడుతున్నారన్నారు. ఎంపీ జీవీఎల్ స్టీల్‌ప్లాంట్‌పై సవతి ప్రేమ చూపిస్తూ దాన్ని నష్టాలను భర్తీ చేసుకోవడానికి హెచ్‌బీ కాలనీలోని స్టీల్‌ప్లాంట్ క్వార్టర్లు ఉన్న 20 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులు ఇవ్వాలని సూచించడం సమంజసంగా లేదన్నారు. అదాని, అంబానీలకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తున్న కేంద్రం.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.6వేల కోట్లు ఇవ్వడానికి ఎందుకు వెనుకడుగు వేస్తుందన్నారు. పార్టీ నగర కార్యదర్శి జగ్గునాయుడు, కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ పాల్గొన్నారు.

మోడల్ స్లమ్ స్కీంకు 55వ వార్డు ఎంపిక

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



55వ వార్డులో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, సమన్వయకర్త కె కె.రాజు

కంచరపాలెం: మురికివాడల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మోడల్ స్లమ్ స్కీంలో 55వ వార్డును ఎంపిక చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు తెలిపారు. వార్డులోని కంచరపాలెం పరిధి ధర్మానగర్, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజుతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ మోడల్ స్లమ్ స్కీంలో డ్రైనేజీలు, కాలువల మరమ్మతులు, శ్మశానవాటికలు, సామాజిక భవన నిర్మాణాలు దశల వారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వార్డులో పందుల బెడద ఎక్కువగా ఉందని, వీధిలైట్లు, పారిశుద్ధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు కమిషనర్ రాజబాబు దృష్టికి తీసుకెళ్లారు. వార్డులో అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చూడాలని జోన్–5 ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ శశికళ, జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి, అసిస్టెంట్ కమిషనర్ (రెవెన్యూ) ఐ.బాబురావు, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ భరణికుమార్, ఏఈ రమణమ్మ, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, ఎస్ఎస్ జనార్దన్, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పార్వతీశ్వరుడి కల్యాణోత్సవం నేడు



పార్వతీశ్వరుల ఉత్సవ విగ్రహాలకు మంగళస్నానం జరిపిస్తున్న అర్చకులు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట గణేష్ నగర్‌లో కొలువైన పార్వతీశ్వర స్వామి 33వ వార్షిక కల్యాణ మహోత్సవం శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. పలు రకాలతో పండ్లతో చూడముచ్చటగా కల్యాణ వేదిక సిద్ధం చేశారు. దీనిలో భాగంగా ఆలయ అర్చకులు గురువారం ఉదయం పార్వతీశ్వరుల ఉత్సవ విగ్రహాలకు మంగళస్నానం జరిపించారు. కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు గణపతి పూజ, పుణ్యావచనం, పంచగవ్యప్రాసన, అస్త రాజార్చన, వాస్తుపూజ, అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠాపన నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు గంగవరపు శివాజీశర్మ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పార్వతీశ్వరుడి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపిస్తామన్నారు. స్వామి కల్యాణ మహోత్సవం చేయించుకునే దంపతులు రూ.516, గోత్ర నామాలతో పూజ చేయించునే వారు రూ.116 ఆలయ సిబ్బందికి చెల్లించాలని చెప్పారు.

విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



గణపతి హోమంలో పాల్గొన్న ఆలయ, గ్రామ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయి నగర్ గ్రామదేవత విజయదుర్గాదేవి 17వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సత్యసాయి సంక్షేమ సాంస్కృతిక సంఘం కమిటీ సభ్యులు, కాలనీ అధ్యక్షుడు కారుకొండ రాజు యాదవ్ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ సోమవారం సాయంత్రం కలశ స్థాపన, 21న తొలేళ్లు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అమృతాభిషేకాలు, ధూప, దీప నైవేద్యాలు సమర్పించనున్నట్లు రాజు యాదవ్ తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం భారీ అన్నదానం, 22వ తేదీ బుధవారం తెల్లవారుజాము నుంచి కుంకుమ పూజలు, కలశాలు, ఘటాల ఊరేగింపు, సాయంత్రం పరస, స్టేజీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు



సంక్షేమ ఫథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకుంటున్న కె.కె.రాజు

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్, తిక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురికివాడల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కె.కె.రాజు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ, పార్టీ నాయకులు దుప్పలపూడి శ్రీనివాసరావు, పైడి రత్నాకర్, రాయుడు శ్రీను, నూకరాజు, సిద్ధార్థ, గంగామహేష్, శ్రీను, సురేష్, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం ధ్యేయం

కంచరపాలెం: ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి రూపకల్పన చేశారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం సచివాలయాల పరిధిలో చెవిటిరాములవీధి, తోటవీధి ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డులో పర్యటించి పలు సమస్యలను గుర్తించారు. వార్డులో స్థానిక కార్పొరేటర్ జాడ కనిపించడంలేదని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు శిథిలావస్థలో ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంపై అధిష్ఠింపజేసి, 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి జరిపారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, అప్పాజీ తదితరులు ఈ సేవ నిర్వహించారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను వేయింపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండువగా సాగింది. పూజల్లో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.